ఫణిదరంలో దాహం కేకలు

- మట్టి దోపిడి కోసం చెరువును ఎండగడుతున్న టీడీపీ నేతలు
- అరకొరగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా
- అధికార పార్టీ వారికి సరఫరాలో అందలం

తాడికొండ: తాడికొండ మండలం ఫణిదరం గ్రామంలో టీడీపీ నాయకులు మట్టి దోపిడి కోసం తాగునీటి చెరువును ఎండగడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామస్తులను గుక్కెడు నీటి కోసం బండెడు కష్టాలు పడాల్సిన దుస్థితికి తీసుకొచ్చారు. మొన్న లాం గ్రామం, నేడు ఫణిదరం అధికార పార్టీ నాయకుల దోపిడికి నిలయాలయ్యాయి. తాగునీటి చెరువులో మట్టి దోపిడికి రంగం సిద్ధమైంది. అందుకు గ్రామంలో టీడీపీ నాయకులు ప్రణాళికా బద్ధంగా ముందుకెళుతుండడంతో గుక్కెడు నీరు దొరక్క జనాలు నానా అవస్థలు పడుతున్నారు. గ్రామంలోని బోరు నీరు కనీసం వాడుకునేందుకు కూడా పనికి రాకుండా ఉన్న నేపథ్యంలో ట్యాంకర్లపైనే ఆధారపడి జీవించాల్సిన పరిస్థితి ఉంది. అయితే అవసరానికి సరిపడా నీటిని సరఫరా చేయాల్సిన నాయకులు మొఖం చూసి తమ వారికి అదనంగా, ఇతరులకు అరకొరగా నీటిని సరఫరా చేస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

> గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇలాంటి ఇబ్బందులు లేవని, తాగునీటి కోసం ప్రశ్నిస్తే పోలీసు స్టేషన్‌కు పిలిపించి వేదించడం ఎంత వరకు సమంజసమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత తాగునీటి సరఫరా అధికారులు, జిల్లా పాలనా అధికారి స్పందించి ఫణిదరంలో తాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పూర్తిగా ఎండిపోయి అడుగంటిన తాగునీటి చెరువు

అడ్డుకున్న వారిపై వేదింపులు..

అధికార పార్టీ అండదండలతో తాగునీటి చెరువు పూడిక తీత అడ్డుపెట్టుకుని అక్రమంగా మట్టిని అమ్ముకునేందుకు రంగం సిద్ధమైంది. దీనిపై గ్రామానికి చెందిన ఓ యువకుడు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం.. ముందస్తు దోపిడి కోసం చెరువును ఎండగట్టారంటూ సోషల్ మీడియాలో పోస్టు చేయగా అతనిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి వేదింపులకు గురిచేస్తున్నారు. 'సమస్యలపై భావ వ్యక్తీకరణను తెలియజేయడం తప్పా.. ఇలా ఎంత వరకు నిర్బంధించి ప్రజా ఇబ్బందులను బయటకు రాకుండా చూస్తారు' అంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీరికి అధికార పార్టీ ప్రజాప్రతినిధి, షాడో ప్రజాప్రతినిధి అండదండలు ఉండటంతో మూడు పువ్వులు, ఆరు కాయలుగా ఆడిందే ఆటా, పాడిందే పాట చందానా దందాలకు తెరలేపుతున్నారు. పోలీసులు సైతం ప్రేక్షకపాత్ర పోషించడంతో గ్రామస్తులు మిన్నకుండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.



ట్యాంకర్ల ద్వారా గ్రామంలో అరకొరగా సరఫరా చేస్తున్న నీరు

ఇబ్బందులకు గురిచేస్తున్నారు..



తాగునీటి కోసం సోషల్ మీడియాలో ఇబ్బందులను తెలియజేస్తూ పోస్టు పెట్టిన యువకుడిని గత వారం రోజులుగా పోలీసు స్టేషన్‌కు పిలిపించి నిర్బంధించి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పోలీసులు సైతం భావ వ్యక్తీకరణను ప్రజలకు తెలియజేసే హక్కు లేకుండా ఇలా వ్యవహరించడం మంచి పద్ధతి కాదు. తాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు చెరువును నీటితో నింపి సరఫరా ప్రారంభించాలి.

– కలవకొల్లు తిరుపతి వెంకయ్య, గ్రామస్తుడు

సరైన పరిష్కారం చూపాలి..



గత నాలుగు నెలలుగా చెరువులోని నీరు తొలగించి ఎండగట్టే ప్రక్రియ ప్రారంభించారు. ఇన్ని రోజులుగా ఈ ప్రక్రియ కొనసాగుతుంటే అధికారులకు కనిపించకపోవడం గమనార్హం. స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపి తాగునీటి సమస్యకు సరైన పరిష్కారం చూపాలి. ట్యాంకర్లతో సరిపడా తాగునీటిని వివక్షత లేకుండా అందించాలి.

– ఎన్.శ్రీహరి, గ్రామస్తుడు

క్లుప్తంగా

పనికి తగిన వేతనం ఇవ్వాలి



తాడేపల్లి రూరల్: మున్సిపల్ కార్మికులకు పనికి తగిన వేతనం ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ తాడేపల్లి పట్టణ గౌరవ అధ్యక్షులు బూరుగ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం తాడేపల్లి కృష్ణనగర్‌లోని మర్సర్ పాయింట్ వద్ద మున్సిపల్ కార్మికులతో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతున్నామన్నారు. గతంలో ప్రభుత్వం మున్సిపల్ కార్మికులతో కుదుర్చుకొన్న ఒప్పందాలను అమలు చేయాలన్నారు. దేశ వ్యాప్తంగా 20వ తేదీన తలపెట్టిన సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు శశికళ, మరియమ్మ, రాంబాబు, కొండయ్య, రమణ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడి నియామకం

ఫిరంగిపురం: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా మార్పుల శివరామిరెడ్డిని పార్టీ అధిష్టానం నియమించింది. మండల కేంద్రంలో గురువారం శివరామిరెడ్డి మాట్లాడుతూ.. తమకు రెండోసారి అవకాశం కల్పించడం సంతోషమన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, తాడికొండ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబుకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన మండల నాయకులు, కార్యకర్తలతో కృతజ్ఞతా భావంతో ఉంటానని పార్టీ విజయానికి కృషిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలి

దుగ్గిరాల: మాదిగ సామాజికవర్గంపై నమోదైన అక్రమ కేసులను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎమ్మార్పీస్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు మాదిగ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం ప్రారంభం నుంచి నేటి వరకు మాదిగలపై ఎన్నో తప్పుడు కేసులు నమోదు చేశారని ఆయన ఆరోపించారు. దీంతో తమ సామాజికవర్గం ఆర్థికంగా నష్టపోతున్నారని ఆయన అన్నారు. ఇకనైనా తారతమ్యాలు లేకుండా ప్రభుత్వం కేసులు ఉపసంహరించుకోవాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

మంత్రి సవిత మాటలు హాస్యాస్పదం

మంగళగిరి టౌన్: రాష్ట్రంలో చేనేత పరిశ్రమను అభివృద్ధి పథంలో నడిపిస్తామన్న చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. సహకార సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.156 కోట్లను విడుదల చేయకపోవడంతో కార్మికులు వడ్డీలు చెల్లించలేక దివాళా తీస్తున్న పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన చెందారు. బకాయిల విడుదలపై మంత్రి హామీ ఇవ్వకుండా సహకార సంఘాలకు ఎన్నికలు జరుపుతామనడం ఎంతవరకు సబాబు అని ప్రశ్నించారు. సహకార సంఘాలకు బ్యాంకులు చెల్లించాల్సిన క్యాష్, క్రెడిట్ పూర్తిగా రద్దు చేయాలని ఆయన ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.

గంజాయి కేసులో ఇద్దరి యువకుల అరెస్ట్

మంగళగిరి టౌన్: మంగళగిరి రైల్వేస్టేషన్ సమీపంలో ఏప్రిల్ 24వ తేదీన గంజాయితో ఇద్దరు యువకులు పట్టుబడగా అదే రోజు వారిని రిమాండ్‌కు తరలించారు. నిందితులను విచారించగా మరో ముగ్గురు వారితో ఉన్నట్లు తెలిసింది. బాపనయ్య నగర్‌కు చెందిన పవన్‌తో పాటు మరో ఇద్దరు యువకులు ఉన్నట్లు నిందితులు తెలిపారు. పవన్‌ను ఈనెల 6న పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. మిగిలిన మరో ఇద్దరు యువకులైన పఠాన్ షారుక్‌ఖాన్, పవన్‌కుమార్‌లను మంగళగిరి రైల్వే స్టేషన్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు.

పోలీస్‌స్టేషన్‌కు డ్రోన్ కెమెరా బహూకరణ



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలను గుర్తించేందుకు ఈ మధ్యకాలంలో డ్రోన్ కెమెరాలు ఉపయోగిస్తున్నారు. విషయాన్ని గమనించిన వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ జాయింట్ రిజిస్ట్రార్ సీఎస్ రావు సీఐ కల్యాణ్‌రాజుకు డ్రోన్ కెమెరాను గురువారం అందజేశారు. సీఐ కల్యాణ్ రాజు, సీఎస్ రావులు డ్రోన్ కెమెరాను ఎగురవేసి పనితీరుని పరిశీలించారు. డ్రోన్ కెమెరా అందజేయడం పట్ల యూనివర్శిటీ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

తాడేపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 20వ తేదీన నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని తాడేపల్లి సి.ఐ.టి.యు పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు పిలుపునిచ్చారు. గురువారం తాడేపల్లిలోని టి.టి యార్డు కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలను వీడనాడాలని కోరారు. కార్మికవర్గం తలపెట్టిన ఈ సమ్మెకు దేశ వ్యాప్తంగా రైతు, వ్యవసాయ కార్మికులు సంఘీభావంగా సమ్మెలో పాల్గొనాలని అన్నారు. 20వ తేదీ ఉదయం 9 గంటలకు తాడేపల్లిలోని సాయిబాబా గుడి సెంటర్ నుంచి కార్మిక ప్రదర్శన ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు బాబూరావు, వెంకటయ్య, ముఠామేస్త్రీలు శ్రీనివాస్‌రావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న దుర్గారావు

జీవో నంబర్ 77ను రద్దు చేయాలని వినతి

మంగళగిరి టౌన్: పీజీ విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను దూరం చేసే జీవో నంబర్ 77ను తక్షణమే రద్దు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) డిమాండ్ చేసింది. మంగళగిరి నగర పరిధిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యామండలి కార్యాలయంలో చైర్మన్ మధుమూర్తికి జీవో 77 రద్దు చేయాలని కోరుతూ గురువారం పీడీఎస్‌యూ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. యువగళం పాదయాత్రలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో నంబరు 77ను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన నారా లోకేష్ ఇప్పటికైనా మాట నిలబెట్టుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. విశ్వవిద్యాలయాల్లో కొన్ని సంవత్సరాలుగా ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయకుండా ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శులు రాజేష్, వీరేంద్ర ప్రసాద్, నాయకులు ధీరజ్, గణేష్, శివ, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



చైర్మన్ మధుమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిరంకుశ వైఖరిలో ఆర్‌టీసీ డీఎం

మంగళగిరి టౌన్: ఏపీఎస్ ఆర్‌టీసీ మంగళగిరి డిపో మేనేజర్ ఉద్యోగుల పట్ల నిరంకుశ వైఖరిని అవలంభిస్తున్నారని సీపీఐ నాయకులు విమర్శించారు. డిపో సెక్రటరి నాగేశ్వరరావు సస్పెన్షన్‌ను వ్యతిరేకిస్తూ గురువారం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రిలే దీక్షను సీపీఐ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. అక్రమంగా సస్పెండ్ చేసిన నాగేశ్వరరావును వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాగేశ్వరరావు ఉద్యోగుల సమస్యలపై ప్రశ్నిస్తే వాటిని పరిష్కరించకపోగా విధుల నుంచి తప్పించడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేసేవరకు పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ప్రభాకర్, ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు చిన్ని సత్యనారాయణ, ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు షేక్ కరీముల్లా, జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నిరసన

పెదవడ్లపూడి(మంగళగిరి): తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలంటూ ఆశా వర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని పెదవడ్లపూడి గ్రామంలో ఆశా వర్కర్లు గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. యూనియన్ నాయకురాలు వాణి మాట్లాడుతూ.. తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర నాన్ గెజిట్ అండ్ గెజిట్ ఆఫీసర్స్ అసోషియేషన్ సంఘీభావం తెలిపింది. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో అసోషియేషన్ మంగళగిరి తాలుకా అధ్యక్షుడు కె.శ్రీరాములు, జాయింట్ సెక్రటరీ పి.చిన్న లాజర్, టి.రాణి, ఎ.జయరాజు, బి.రాణి, సుమనశ్రీ, పద్మ, లావణ్య, రజని, ఎస్తేరు, సునీత, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు

ఎన్నికల హామీలపై దృష్టి సారించాలి

మంగళగిరి టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తోందని.. ఇప్పటికైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై దృష్టి సారించి వాటిని అమలు చేయాలని సీపీఎం జిల్లా పూర్వకార్యదర్శి పాశం రామారావు అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని కాజ గ్రామంలో సీపీఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ సింహాద్రి వాసుదేవరెడ్డి 16వ వర్ధంతి, కామ్రేడ్ తాడిపోయిన వీరస్వామి 4వ వర్ధంతి సభను పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. కామ్రేడ్ వాసుదేవరెడ్డి, కామ్రేడ్ వీరాస్వామి పార్టీ అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. అనంతరం పలు స్థానిక సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు ప్రతాప్ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అప్పారావు, నాయకులు తమ్మా ప్రసాద్ రెడ్డి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు



తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో పలుచోట్ల గురువారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. దీంతో ప్రాతూరు అండర్‌పాస్, ఓల్డ్ టోల్‌గేటు అండర్ పాస్, మణిపాల్ హాస్పిటల్ ప్రాంతాల్లో వర్షంలో తడవకుండా ప్రజలు అండర్‌పాస్‌లను ఆశ్రయించారు. ఆ రోడ్డులో ప్రయాణించే ఆటోలు, కార్లు దారిలేక అండర్‌పాస్ వద్దే బారులు తీరాయి.

వస్త్ర దుకాణంలో చోరీ

మంగళగిరి: వస్త్ర దుకాణంలో చోరీ సంఘటన నగర పరిధిలోని వారాహి హ్యాండ్‌లూమ్స్ వస్త్ర దుకాణంలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. గురువారం తెల్లవారుజామున దొంగలు వెనుక ఉన్న ఫైరేకులు తొలగించి దుకాణంలోకి చొరబడ్డారు. రూ.2.50 లక్షల విలువైన 15 పట్టు చీరలు, కొంత నగదు చోరీ చేసి పరారయ్యారు. రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ సీహెచ్ వెంకట్ కేసు నమోదు చేశారు.

రెండు పూటలా హాజరు విధానాన్ని రద్దు చేయాలి

మేడికొండూరు: ఉపాధి హామీ కార్మికులకు రెండు పూటలా హాజరు వేసే విధానాన్ని రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. గురువారం మేడికొండూరు మండలంలోని పేరేచర్ల గ్రామంలో ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఉపాధి కార్మికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

తాడికొండ: పార్టీ కోసం కష్టపడి పనిచేసి గ్రామ స్థాయిలో నాయకులు, కార్యకర్తలను కలుపుకొని 2029లో వైఎస్సార్‌సీపీ విజయానికి బాటలు వేయాలని తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాలవజ్రబాబు(డైమండ్‌బాబు) అన్నారు. నియోజకవర్గంలో పదవులు ప్రకటించిన నేపథ్యంలో గురువారం తాడికొండ మండల కమిటీ, గ్రామపార్టీ అధ్యక్షులుగా ఎంపికైన పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయన్ని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. తాడికొండ, మేడికొండూరు మండల పార్టీ అధ్యక్షులు ఎం.మనోహర్, టి.వంశీకృష్ణ, మాజీ సొసైటీ చైర్మన్ చుండు వెంకటరెడ్డి, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ రాజు, రైతు విభాగం నియోజకవర్గ నాయకులు రాఘవరెడ్డి, వైఎస్ఎంపీపీ రెడ్డి శ్రీవేణి, ఎంపీటీసీలు రావూరు దివ్య పాల్గొన్నారు.

చందన అలంకరణలో వేంకటేశుడు



దుగ్గిరాల: దుగ్గిరాల పసుపుయార్డు సమీపంలోని కల్యాణ వేంకటేశ్వరుడిని గురువారం విశేషంగా అలంకరించారు. వైశాఖ బహుళ తదియ రోజున దేవస్థానం స్వామి వారి మూలమూర్తికి చందనంతో ప్రత్యేకంగా అలంకారం చేశారు. ఉదయం 7 గంటలకు సహస్రనామార్చన జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జూన్ 5న ఏపీజీఈఏ సమావేశం



దుగ్గిరాల: జూన్ 5న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరగనున్న రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లు అందరూ హాజరు కావాలని దుగ్గిరాల యూనిట్ అధ్యక్షులు అందె బాలచంద్రమౌళి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర సీఎం పాల్గొంటారని.. ఈ సమావేశానికి అందరూ విధిగా రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో చంద్ర మోహన్, డిప్యూటి ఎంపీడీఓ నెహ్రూ, అనూరాధ, రామ్ కుమార్, రవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర విద్యాభవన్ ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా

మంగళగిరి: పాఠశాలల పునఃవ్యవస్థీకరణ, ఉపాధ్యాయుల రేషనలైజేషన్, బదిలీలు, ప్రమోషన్లుకు సంబంధించిన సమస్యలపై విద్యాశాఖ మంత్రి తక్షణం జోక్యం చేసుకుని పరిష్కారం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలంటూ గురువారం విద్యాభవన్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన పీడీఎఫ్ ఎమ్మెల్సీలు కె.ఎస్ లక్ష్మణరావు, గురుమూర్తిలు మాట్లాడుతూ విద్యావిధానంలో ప్రభుత్వం చేపట్టిన విధానాలతో ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు యూటీఎఫ్ రాష్ట్ర నాయకత్వం, పీడీఎఫ్ ఎమ్మెల్సీలను చర్చకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను కమిషనర్‌కు తెలియజేశారు. సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



ధర్నా నిర్వహిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

అర్ధరాత్రిళ్లు నిప్పు.. పొగతో ప్రజలకు ముప్పు

దుగ్గిరాల: కొందరు రైతులు పంట పొలాల్లో మొక్కజొన్న దంటులు, ఎండిన ఆకులను అర్ధరాత్రిళ్లు తగలబెట్టడం ద్వారా విపరీతమైన సెగ, పొగ, నుసి, స్థానిక ఇళ్లల్లోకి చేరుతోంది. ఫలితంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దుగ్గిరాలలో వారం రోజులుగా ఇదే పద్ధతిన తగలబెట్టడం ద్వారా ప్రజలు అవస్థలు పడుతున్నారు. రైతులు ఇలా తగలబెట్టడం వల్ల కాలుష్యం ఏర్పడటమే కాకుండా కొన్ని సార్లు ప్రమాదాలతో పాటు పంట నష్టం కూడా జరుగుతుందని వాపోతున్నారు. మంటలతో వ్యాపించే దట్టమైన పొగకి పాములు, కొండ చిలువలు జనావాసాలలోకి వస్తున్నాయని ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. సమస్యను మండల వ్యవసాయ అధికారి శిరీష వద్ద ప్రస్తావించగా రైతులు ఇలా తగలబెట్టకుండా కట్టర్ వేయడం.. లేదా రోటావేటర్ వేయడం.. శాస్త్రీయంగా చేయడం వల్ల భూమిలో కలిసి ఎరువుగా ఉపయోగపడుతుందని ఆమె అన్నారు.



మొక్కజొన్న తోటలో అలముకున్న పొగ

పారిశ్రామిక అభివృద్ధిలో బీసీల భాగస్వామ్యం పెంచాలి

మంగళగిరి టౌన్: రాష్ట్ర వర్తక, వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో బీసీల భాగస్వామ్యం పెంచాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు కోరారు. ఆయన నేతృత్వంలో కొందరు నేతలు మంగళగిరిలోని కేంద్ర పార్టీ కార్యాలయంలో గురువారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును కలసి వినతిపత్రం అందజేశారు. బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం నియమించిన అన్ని కమిషన్లు రాష్ట్రంలో బీసీలు 52 శాతంగా ఉన్నారని.. వారు సామాజికంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసే విధంగా బీసీల ఉద్యోగుల కోసం కూడా చేయాలని ఉద్యోగుల ప్రమోషన్లలో కూడా రిజర్వేషన్లు ఇవ్వాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగ మల్లేశ్వరరావు, ఉద్యోగ విభాగ రాష్ట్ర అధ్యక్షులు మూర్తి, గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న కేశన శంకరరావు

పాడి పశువుల నిర్వహణకు రుణాలు

దుగ్గిరాల: పాడి పశువుల నిర్వహణకు బ్యాంకు రుణాల మంజూరిపై అవగాహన కార్యక్రమాన్ని గొడవర్రు గ్రామంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి వి.శివకుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న గుంటూరు లీడ్ బ్యాంక్ అధికారి మహిపాల్ రెడ్డి బ్యాంకు రుణాల మంజూరు విధానంపై అవగాహన కల్పించారు. కౌలు రైతు సంఘం అధ్యక్షులు మన్నవ నాగేశ్వరరావు, చంద్రశేఖర్, విజయలక్ష్మీ, మాధవి, నాగరాజు, సాంబయ్య, బాబురావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుంటూరు జిల్లా లీడ్ బ్యాంక్ అధికారి

దేశవ్యాప్త కార్మిక సమ్మె బుక్‌లెట్ ఆవిష్కరణ

మంగళగిరి టౌన్: ఈనెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ మంగళగిరి నగర పరిధిలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. 17వ తేదీన కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళగిరి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్షులు కమలాకర్, జిల్లా నాయకులు యస్‌యస్ చెంగయ్య, నాయకులు వీవీ జవహర్‌లాల్, పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ, సీనియర్ నాయకులు జేవీ రాఘవులు, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సార్వత్రిక సమ్మె బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు